సీరియల్ కథ

# రాబందులు X

రచన : శ్రీ. ఎన్. లక్ష్మీనారాయణ.

(గత సంచిక తరువాయి)

వివాహం లేని ప్రేమ ఏ క్షణంలోనైనా సంఘానికి వెరవాల్సొస్తుందనే అంశం నా విషయంలో అక్షరాల నిజమైపోయింది. నాకు మాతృత్వం ఏర్పడింది. ఏపనీలేని కొందరు ఇరుగుపొరుగువారు నాశీలాన్ని గూర్చి పదే పదే వ్యాఖ్యానిస్తూ చీటికి మాటికి విసిరే ఏటి మాటలు నా హృదయానికి కత్తిపోట్లుగ పరిణమించాయి. పరిస్థితులు విషమించి, సమాజపు హేళనకు గురికాకముందే మేముభయులమూ దంపతులం కావాలనే కాంక్ష కొద్దీ నేను యెప్పటికప్పుడు జగన్నాథాన్ని తొందరపెడుతూ వచ్చాను: 'పెళ్ళంటే మాటలా' అదిగో, ఇదిగో, అని అంటూనే ఆరుమాసాలు జరిపాడు. ఆ వ్యవధిలో నా ఆభరణాలన్నీ అమ్మించి, నా ఇల్లు కాస్త తాకట్టు పెట్టించి డబ్బంతా వినోద విలాసాల క్రింద మంచినీటి ప్రాయంగా ఖర్చు పెట్టేశాడు. నమ్ముకున్నదాన్ని ఆదరించి అర్ధాంగిగ చేసుకుంటాడు కదా అనే భావనతో అటు ఆలోచనలకు ఆస్పదమివ్వక, ఇటు అతని మనస్తత్వాన్ని అర్ధం చేసుకోలేక నేను మోసపోయాను: జగన్నాథం ఇస్తూ వచ్చిన సమాధానాన్ని ఎంతో సహనంతో చెవినవేసుకుంటూ వచ్చాను. కానీ సహనానికీ ఒక హద్దుంది. ఏనుగు ఎంతో వినయంగా సరియైనమార్గంలో నడచుకెడుతున్నా చేతిలో అంకుశం ఉందికదా అని మావటీడు దానిమీద అనవసరంగా పోట్లు పొడిస్తే ఏనుగు తిరగబడక ఏం చేస్తుంది? దానికి అంతకంటే గత్యంతరమేముంటుంది?

ఆరోజు సాయంత్రం వారు ఇంటికి వచ్చారు డబ్బు కావాలని. నిలదీసి వివాహం విషయం అడిగాను.

'ఇప్పుదేమంత తొందర హేమా?' అని నిబ్బరంగా పలికాడు:

'ఇదేమిటండీ నా భౌతిక పరిస్థితిని చూస్తూనే ఇల్లా ప్రశ్నిస్తున్నారు? పాపపు ఫలితాన్ని అనుభవిస్తూ నేను పదిమంది మధ్య ఎల్లా తలెత్తుక తిరగటం? మూడురోజుల్లోగా మన వివాహం జరిగిపోవాలి.' అని అన్నాను ఎక్కడలేని ఆవేశం తెచ్చుకొని.

'ఓ దానికేముంది? రేపే చేసుకుందాం: ఏదీ ఒరెండు వేలు ఇటు పడెయ్యి' అని అన్నారు:

ఆవే వారి చివరి మాటలనీ, ఆవే వారి చివరిదర్శనమనీ తెలుసుకోలేక పోయ్యాను: ఇంట్లో కెళ్ళి మిగిలిన పదిహేనువందలు తెచ్చి సమర్పించుకున్నాను, దేవుడికి భక్తులు సమర్పించుకునే నైవేద్యం లాగ: అంతే మరుసటిరోజునుండి వారిజాడ అగుపించలేదు.

నా బ్రతుకు నడిసముద్రంలో చుక్కాని లేని నావలాగ తయారవుతుందని కలలో కూడ ఊహించలేదు: లోకంలో సన్మార్గులకు, సత్శీలురకు మాత్రమే ద్రోహాలు జరుగుతాయి. ఉపకారులకు మాత్రమే అపకారాలు జరుగుతాయి. నిజాయితీలో బ్రతికేవారికే ప్రపంచంలో అన్యాయాలు జరుగుతాయి. ఇవి నా అనుభవంలోనికొచ్చాయి: హృదయం ఇచ్చి, ప్రేమించి, అన్నివిధాల అతన్ని అభిమానించినందుకు, జగన్నాథం నాకు ద్రోహం తలపెట్టాడు. నా జీవితాన్ని నవ్వులపాలు చేశాడు. ఐనా నేను అతన్ని కోపగించలేదు. నా రాత అల్లా ఉంది కాబోలు, అని నన్ను నేను ఓదార్చుకున్నాను. విధి నన్ను పరిహసించింది: అంతకంటే మరేమీ లేదు' ఆమె చెప్పటం కాస్త ఆపింది కానీ నా కన్నీరుమాత్రం ఆగలేదు: ఇంతవరకు ఆమె కథనం నా హృదయాన్ని కదలించి. కరగించింది: ఎందుకో నేను మరో మారు ఆమెను చూడలేకపోయ్యాను: చూడాలని ప్రయత్నించినా నాలోని బలహీనత ఏదో అడ్డొచ్చి నా ప్రయత్నాన్ని కూలద్రోసింది:

'ఆ తరువాత!' అడిగాను ఆదుర్దాగా.

ఈ ప్రశ్నకు ఆమె చిన్నగా నవ్వింది: ఆ నవ్వులో ఆమె తన గతజీవిత స్మృతులను నెమరువేసుకుంటూ వాటి తాలూకు విషాదాన్ని ఒలకబోసిందని నాకు తెలుసు.

'ఆ తరువాత ఏమౌతుంది: జరగాల్సిందేదో జరిగిపోయింది: పెద్దపర్వతం మీదినుండి ఒక రాతిని క్రిందికి దొర్లించాక అది క్రమంగా దొర్లిదొర్లి క్రింద బడుతుంది:

ఇంచుమించు నా కథకూడ అల్లాగే పరిణమించింది: జగన్నాథం నా జీవిత అథఃపతనానికి జారుడు మెట్లు ఏర్పరచిపోయాడు. కళంకినిగా ఎదుటివారికి నా ముఖం చూపలేక, ఉన్న ఊరు, ఉన్న ఇల్లు విడచి ఏ దూర తీరాలకో వెళ్ళి అజ్ఞాతజీవితానికి తలొగ్గాలని నిశ్చయించుకున్నాను.

అంతలోనే అనుకోని విధంగా ఆ రోజున మా బావ సుధాకర్ వచ్చాడు: అతన్ని చూడగానే 'అంధకారంలో వెలుగు కిరణాల్లా' నిరాశా పూరితమైన నా జీవిత క్షేత్రంలో కళా ప్రమాణాలు విచ్చుకున్నట్టు ఆనందించాను కానీ, ఆ ఆనందమేదో క్షణికకాలం మాత్రమేనని గ్రహించలేకపోయ్యాను. నన్ను చూడగానే సుధాకర్ నఖశిఖ పర్యంతం మండిపోతూ, ముఖంలో రంగులు మారుస్తూ, ఎక్కడలేని ఆవేశం తెచ్చుకొని 'హేమా! ఆరోజు నీవు, మీ నాన్న కలసి కట్టుగ నన్ను అవమానించి, హంతాత్తుగ నాపట్ల నిరాదరణ చూపారు: ఆత్మీయత, అనురాగాలు దూరం చేసుకున్నారు: గొప్ప సాంప్రదాయ కుటుంబీకులుగ ప్రవర్తించారు: కానీ ఈనాడు లోకం దృష్టిలో నీవు చేయరానిపని చేశావు. పవిత్రమైన శీలాన్ని ఎవడో దారినబోయే దానయ్యకు అంకితం చేశావు: నీవు శిక్షార్హురాలివి' అని గర్జించాడు.

అవును బావా నేను తప్పుచేశాను: చేసిన తప్పును ఒప్పుకుంటున్నాను. నేను జగన్నాథాన్ని నమ్మి, ప్రేమించి, నా సర్వసం అర్పించి, మోసపోయి చివరకు అధోగతి పాలయ్యాను; వక్రించిన జీవితాలను సక్రమగతి పాలయ్యాను; వక్రించిన జీవితాలను సక్రమమార్గంలో నడిపింప చేయటానికి ప్రయత్నించటం బుద్ధిమంతుల లక్షణం నేను ఈ రోజున దిక్కులేనిదాన్నయ్యాను. నాకో మార్గం చూపు: నీకు భగవంతుడు మేలుచేస్తాడు' అని ప్రార్థించాను:

'అఘోరించలేక పోయ్యావ్: ఆనాడు నీకు హితోపదేశం చేసి, నాతో మాటలాడకుండా, నా ప్రేమబంధాలను తెంచేసి ఇప్పుడు చచ్చి స్వర్గాన ఉన్న మీ నాన్నగారిని అడుగు. నీకు దారి చూపుతాడు: నీకో దారంటూ చూపటానికి నే నెంతటివాణ్ణి. వెళ్ళి దగాచేసిన ఆ జగన్నాథంగాడెక్కడున్నాడో వెదకి, కనికరించుమని వాడి కాళ్ళమీద బడు: చేసినతప్పును కప్పి పుచ్చుకోటానికి మొసలి కన్నీరోహటూ: సిగ్గులేకపోతే సరి: ఛీ ఇంకా ఏ ముహం పెట్టుక బ్రతకాలనుకున్నావ్?' అని నిందించి వెళ్ళిపోయాడు. ఎండ వేడిమికి తట్టుకోలేక ఒక బట్టతలవ్యక్తి నీడక్రింద విశ్రాంతికని ఓ తాటిచెట్టు క్రింద నిల్చుండే తాటిఫలం అతడి బట్టతలమీద బడ్డట్లు బాధను తొలగిస్తాడని భావించిన సుధాకర్ నా గుండె మీద ఓ కుంపటి పెట్టి నిష్క్రమించాడు: నేను దైవోపహతురాలనయ్యాను. ఏమైనా సుధాకర్ కొన్ని జీవిత సత్యాలను చాటిచెప్పి నాకు కనువిప్పును కలిగించాడు. కలిమిలో కలిసివచ్చే బంధువులు లేమిలో లేమంటారు. బంధువులం కామంటారు. సంబంధాలు లేనట్టు విచిత్రంగా ప్రవర్తిస్తుంటారు, లోకంలో ఉన్నవారికీ మర్యాదలు, అనురాగాలు: మా నాన్నగారున్నపుడు ఎడతెగకుండా వచ్చి మా క్షేమసమాచారాలు పరామర్శించి వెళ్ళే మా బంధుమిత్రులు క్రమంగా నా కళ్ళకు దూరమయ్యారు:

* * *

విజయవాడను వదలి ఆ రాత్రికి గుంటూరు చేరుకున్నాను: సుధాకర్ పలుకులు చెవిన సోకినప్పటినుండి దూరతీరాలకు వెళ్ళి బ్రతకాల్సిన అగత్యమేమీ లేదనుకున్నాను: జగన్నాథం కోసం అన్వేషించటం మొదలెట్టాను:

రెండురోజులు తిరిగాను ఊరంతా: కానీ ప్రయోజనమేమీ లేకపోయింది; తెచ్చుకున్న డబ్బు, గుడ్డలు ఎవరో కాజేశారు. నిస్సహాస్థితిలో పడ్డాను: ఎక్కడికి పోవాలి? ఏం చేయాలి? అన్న సమస్యలకు పరిష్కార మార్గం ఏర్పడలేదు. అవి శేష ప్రశ్నలుగానే నిలచిపొయ్యాయి.

అకస్మాత్తుగ ఒకరోజున స్టేషన్ వద్ద ఒకవ్యక్తి అగుపించి 'ఏమ్మా? ఊరువిడచి ఎప్పుడొచ్చావ్? ఇక్కడెందుకిల్లా తిరుగుతున్నావు? ఇంతకీ నీవు...' అని అంటుండగానే 'మాది విజయవాడఅండీ! నేను ప్లీడర్ వాసుదేవగారమ్మాయిని' అని అన్నాను:

'ఆఁ! అదే! అప్పుడెప్పుడో చూశాను: చిన్నతనంలో మీ నాన్న నేను ఒకచోట చదువుకున్నాం: ఒకే రూంలో ఉండేవాళ్ళం: ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకు నేవాళ్ళం: ఇంతకీ మీ నాన్నగారు బాగున్నారామ్మా?' అని అడిగారాయన.

'అదేమిటండీ మా నాన్నగారు కళ్ళుమూసి ఆరు మాసాలు కావస్తోంది' అని నా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాను. 'ఆ! అవునవును: మధ్య తెలిసింది: వచ్చి మాటాడిద్దామనుకుంటే ఏదీ, తీరికెక్కడిది? మంచి వాళ్ళను దేవుడు తొందరగా తనవద్దకు తీసుకెడతాడమ్మా! అన్నట్టు ఇక్కడకువచ్చి, మా ఇంటికి రాకపోవడమేమిటమ్మా! అన్ని సంగతులు ఇంటివద్ద మాటాడుకుందాం; రా, వెడదాం' అని ఓ రిక్షాను కేకేశాడు; రిక్షాలో కూచుని 'కూర్చోమ్మా!' అని అన్నాడు: నేను ఆయన ప్రక్కన కూచోటానికి వెనుకంజవేశాను కానీ 'ఫరవాలేదు, కూచోమ్మా' అని ఆయన మరోమాట పలుకటంతో నేను ఆయనప్రక్కనే కూచున్నాను.

వారింట్లో అడుగెట్టాక, భోజనం పెట్టించి, విశ్రాంతి తీసుకోమన్నారు. సాయంత్రం ఎందుకో ఒక లేడీ డాక్టర్ మెడలో స్టెతస్కోపు తగిలించుకొని చిరునవ్వు నవ్వుతూ నావద్దకు వచ్చింది. కొంతసేపటికి ఆమె నన్ను పరీక్షించటం మొదలుపెట్టింది: ఆమె నన్ను అల్లా ఎందుకు పరీక్షిస్తోందో నాకు అర్థంకాలేదు: పరీక్షించటం ముగించుకొని నావైపు ఒక్కమారు అదోలా చూచి ఆ లేడీడాక్టర్ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయిన కొంతసేపటికి ఆయనవచ్చి, చింతనిప్పుల్లా మండిపోతున్న కళ్ళతో భయంకరంగా చూచి 'అప్పుడే చెప్పలేకపొయ్యావ్? నాకు పెళ్ళయింది: నేను గర్భవతినని: నీమీద ఏంతో ఆశపెట్టుకుని నిన్ను ఇక్కడకు తీసుకువచ్చాను. తీరా చూస్తే నీవు మామూలు మనిషివి కావని లేడీ డాక్టర్ చెప్పిపోయింది. నీ అందాన్ని చూచి మొదట ఎంత ఆసపడ్డానో, ఇప్పుడు అంత నిస్పృహ చెందాను. నిన్నని ఏమీ లాభం లేదు; అది కేవలం నా దురదృష్టం: వెళ్ళు తక్షణం బయటికినడు: నీవు ఒక్కక్షణమైనా నా ఇంట్లో ఉంటానికి వీల్లేదు' అని కేకలు వేసి బయటికి పారద్రోలాడు: అతని మాటలు వినగానే నా కడుపులో ఎవరో చేతులుపెట్టి ప్రేవులు కదల్చినట్టనిపించింది. మా నాన్నగారి స్నేహితుడని చెబితే నమ్మి, నేను ఆయనను గ్రుడ్డిగా అలుసరించానే కానీ, మేకతోలు కప్పుకున్న పెద్దపులిలాంటి పెద్దమనిషి అని మాత్రం అనుకోలేదు. నా అందాన్ని అనుభవించి ఆనందించాలని ఆశించాడు కానీ అది కాస్త అందరానిదై పోగానే ఆగ్రహించి అవతల నెట్టేశాడు. ఒక ఆడది. అందులోనూ నిస్సహాయస్థితిలో ఉండే ఒక అబల అగుపిస్తే కొందరు, మగవారి మనసులు ఏవిధంగా మారుతాయో, వారి బుద్ధులు ఎల్లా పెడదారిన బడతాయోనన్న అంశాన్ని కొంతవరకు అర్థంచేసుకున్నాను. ఆడబ్రతుకులోని అనర్థకాలు నాకు ఒక్కొక్కటే అగుపించటం మొదలెట్టాయి. మరల దిక్కులేని కుక్కపిల్లగా వీధినబడి తిరిగాను. కాలచక్రంలో మూడుమాసాలు గడచిపొయ్యాయి. కానీ ఎల్లా గడిచాయన్న విషయం మాత్రం నాకు ఊహాతీతంగా ఉండిపోయింది.

(సశేషం)

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.